పేదల ఇండ్లను కూల్చితే అగ్నిగుండమే

- విశ్వనగరాన్ని వల్లకాడుగా మారుస్తున్న సీఎం రేవంత్
- మూసీపై సంపూర్ణ ప్రజాభిప్రాయం సేకరించాలి
- మూసీ వెంట బడా రియల్ సంస్థలకు ఇచ్చిన నిర్మాణ అనుమతులన్నీ రద్దుచేయాలి
- 58 కిమీ పనులకు 1.5 లక్షల కోట్లా?
- నీళ్లు లేని నదిలో రివర్‌ఫ్రంట్ పెడతారా?
- సుందరీకరణ పేరుతో భారీ దందా
- మూసి బాధితులకు అండగా కేసీఆర్
- బీఆర్‌ఎస్ నేత పీ కార్తీక్‌రెడ్డి

తెలంగాణ భవన్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నేత కార్తీక్‌రెడ్డి తదితరులు

హైదరాబాద్, సెప్టెంబర్ 27 (నమస్తే తెలంగాణ): మూసీ సుందరీకరణ పేరుతో పేదల ఇండ్లను కూల్చితే హైదరాబాద్ అగ్నిగుండంగా మారుతుందని బీఆర్‌ఎస్ నాయకుడు పీ కార్తీక్‌రెడ్డి హెచ్చరించారు. మూసీ ప్రాజెక్టుపై సంపూర్ణ ప్రజాభిప్రాయ సేకరణ జరగాలని, నిర్వాసితుల ఆమోదంతోనే సుందరీకరణ చేపట్టాలని డిమాండ్ చేశారు. మూసీ వెంట బడా సంస్థలు చేపడుతున్న భారీ రియల్‌ఎస్టేట్ ప్రాజెక్టుల అనుమతులన్నీ రద్దు చేయాలని కోరారు. శుక్రవారం ఆయన తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌ను వల్లకాడుగా మార్చారని విమర్శించారు. పేద, మధ్య తరగతి వర్గాలకు చెందిన ఇండ్లను హైడ్రా, మూసీ పేరుతో కూల్చివేయాలని చూస్తున్నారని మండిపడ్డారు. చేతులు తడిపిన వారి జోలికి ప్రభుత్వం వెళ్లడం లేదని, పేద, మధ్య తరగతి ఇండ్లనే కూల్చేస్తున్నారని ఆరోపించారు. మూసీ సుందరీకరణ పేరిట దందా నడుస్తున్నదని ఆరోపించారు. బాధితులకు కేసీఆర్ అండగా ఉంటారని, ప్రజల తరపున మహాశక్తిలా నిలబడి పోరాడతారని చెప్పారు. ఎవరు బెదిరించినా బీఆర్‌ఎస్ కార్యాలయానికి ఫోన్ చేస్తే వెంటనే స్పందిస్తామని తెలిపారు. మూసీ బాధితులను కూడగట్టి బడా రియల్‌ఎస్టేట్ నిర్మాణ సంస్థల ముందు ధర్నా చేస్తామని హెచ్చరించారు. ప్రాధాన్యాలు నిర్ణయించుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. రాష్ట్రాన్ని ఎటువైపు తీసుకెళ్తున్నారో పాలకులకు అర్థం కావడం లేదని దుయ్యబట్టారు. కేసీఆర్ హయాంలో తెలంగాణ సంతోషంగా, ఆర్థిక పరిపుష్టితో ఉండేదని, ఇప్పుడు అన్ని వ్యవస్థలూ కుప్పకూలాయని మండిపడ్డారు. హైడ్రా పేరిట ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, రైతులను మళ్లీ అడుక్కునే స్థితికి తీసుకొస్తున్నారని విమర్శించారు. తినడానికి చద్దన్నం లేదు కానీ బిర్యానీ తినిపిస్తా అన్నట్టుగా రేవంత్ వ్యవహారం ఉన్నదని ఎద్దేవా చేశారు.

లక్షన్నర కోట్ల అంచనా ఎక్కడిది?

మూసీ సుందరీకరణకు బీఆర్‌ఎస్ హయాంలో రూ.16 వేల కోట్లతో డీపీఆర్ తయారైందని, ఇప్పుడు రూ.1.5 లక్షల కోట్ల అంచనా ఎక్కడి నుంచి వచ్చిందో చెప్పాలని కార్తీక్‌రెడ్డి నిలదీశారు. 2,400 కిలోమీటర్లు ఉండే నమామి గంగ ప్రాజెక్టుకే రూ.40 వేల కోట్లు ఖర్చు కాలేదని, 58 కిలోమీటర్లలో ఉన్న మూసీ సుందరీకరణకు లక్షా యాభై వేల కోట్లా? అని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు కూడా లక్ష కోట్లు ఖర్చు కాలేదని గుర్తుచేశారు. మూసీ మీద లక్షన్నర కోట్లు ఖర్చు పెడితే తిరిగి రాబడి ఎలా వస్తుందని, నీళ్లే లేని నదిలో రివర్‌ఫ్రంట్ పెట్టడం ఏమిటని ప్రశ్నించారు. మూసీలో సెప్టెంబర్, అక్టోబర్‌లో తప్ప నీళ్లు ఎప్పుడూ ప్రవహించవని చెప్పారు. అసలు మూసీకి గరిష్ఠ ప్రవాహ స్థాయి లెక్కలున్నాయా? ఉంటే వాటిని బయట పెట్టాలని డిమాండ్ చేశారు. ముందు రివర్‌బెడ్, మ్యాగ్జిమమ్ ఫ్లడ్‌లెవల్ (ఎంఎఫ్‌ఎల్)ను నిర్ణయించాలని సూచించారు. ప్రజలకు మూసీ రివర్ ఫ్రంట్ మీద ఆసక్తి లేదని పేర్కొన్నారు. రూ.1,500 కోట్లతో మూసీకి డీపీఆర్ తయారుచేస్తారా? అని ఆశ్చర్యం వ్యక్తంచేశారు. ఎవరికి టెండర్లు ఇవ్వాలో రేవంత్ ప్రభుత్వం ముందే నిర్ణయించుకున్నదని ఆరోపించారు. మూసీ పనులను బ్లాక్‌లిస్ట్‌లో ఉన్న మెయిన్‌హార్ట్ కంపెనీకి కట్టబెట్టే ప్రయత్నం జరుగుతున్నదని ఆరోపించారు.

మూసీ కార్పొరేషన్‌కు 50 వేల కోట్లు జమచేయాలి

మూసీ కార్పొరేషన్‌కు ముందుగా రూ.50 వేల కోట్లు జమ చేసి నిర్వాసితులకు భరోసా ఇవ్వాలని కార్తీక్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఒకవైపు రాష్ట్రం దివాలా తీసిందని, వేతనాలకు కూడా డబ్బులు లేవని చెప్తూ.. మరోవైపు 1.5 లక్షల కోట్లతో మూసీ సుందరీకరణ ఎలా చేపడుతున్నారని నిలదీశారు. హైడ్రాతో అటెన్షన్ డైవర్షన్, మూసీతో ఫండ్ డైవర్షన్ జరుగుతున్నదని ఆరోపించారు. ప్రభుత్వాన్ని కేసీఆర్ ప్రజల పట్ల ప్రేమతో నడిపితే, రేవంత్‌రెడ్డి మాత్రం భయపెట్టి నడుపుతున్నారని దుయ్యబట్టారు. రేవంత్ సర్కార్ మీద ప్రజలు తిరగబడే రోజులు వచ్చాయని హెచ్చరించారు. సమావేశంలో రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్లు గజ్జెల నగేశ్, చిరుమళ్ల రాకేశ్‌కుమార్, వై సతీశ్‌రెడ్డి, బీఆర్‌ఎస్‌వీ నేత చటారి దశరథ్ పాల్గొన్నారు.

సర్వేను నిలిపివేయాలని సూర్యాపేట కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న బాధితులు

50 ఏండ్లుగా ఇక్కడే బతుకుతున్నం
హైడ్రా సర్వేను నిలిపివేయాలి

ఇండ్లను కూల్చే కుట్రలను ఆపండి..
సూర్యాపేట కలెక్టరేట్ ఎదుట బాధితుల ఆందోళన

సూర్యాపేట, సెప్టెంబర్ 27: 'యాభై ఏండ్లుగా ఇక్కడే బతుకుతున్నం.. మా బతుకులు ఆగం చేయకండి' అంటూ సూర్యాపేట జిల్లా కేంద్రంలోని వివిధ కాలనీలవాసులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇండ్ల వద్ద సర్వేను నిలిపేయాలని కోరుతూ శుక్రవారం కలెక్టరేట్ ఎదుట పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. ఎఫ్టీఎల్, బఫర్ జోన్ పేరుతో పేదలం నిర్మించుకున్న ఇండ్లను కూల్చివేసే కుట్రలను ఆపాలని డిమాండ్ చేశారు. పట్టణంలోని 30, 42, 43వ వార్డుల్లోని వివిధ కాలనీల్లో 50 ఏండ్లుగా సద్దుల చెరువు పక్కన ఇండ్లు కట్టుకొని జీవిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ అనుమతులు తీసుకొని ఇండ్లు కట్టుకుంటే, ఇప్పుడు వాటిని కూల్చివేసే కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. సద్దుల చెరువు పక్కన మూడు ప్రభుత్వ పాఠశాలలు, పార్కు, కమ్యూనిటీ హాల్, వసతి గృహాలు ఉన్నాయని, వాటినెలా నిర్మించారని ప్రశ్నించారు. అనుమతులు ఇచ్చేది ప్రభుత్వమే, కూల్చివేసేది ప్రభుత్వమేనా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు సర్వేతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారని, వెంటనే సర్వేను నిలిపివేయాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు అంగిరేకుల రాజశ్రీనాగార్జున, పల్స మహాలక్ష్మిమల్సూర్, కోఆప్షన్ సభ్యురాలు బత్తుల ఝాన్సీరమేశ్, మీర్ అక్బర్, గాలి సాయికుమార్, కట్టు శంకర్, చంచల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, అధికారులకు దండం పెట్టి వేడుకుంటున్న వేములవాడ గుడి చెరువు వద్ద నివాసి దేవమ్మ

అయ్యా.. మా ఇండ్లు కూలగొట్టొద్దు!

వేములవాడ గుడి చెరువు నివాసితుల వినతి
విప్ ఆది శ్రీనివాస్‌కు చేతులెత్తి మొక్కిన బాధితులు

వేములవాడ, సెప్టెంబర్ 27: 'అయ్యా మా ఇండ్లను కూలగొట్టొద్దు.. పడగొట్టకుండా చూడండి' అంటూ రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలోని గుడి చెరువు వద్ద నివాసితులు శుక్రవారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు విన్నవించారు. ఇటీవల గుడి చెరువు వద్ద అధికారులు సర్వే చేసి, ఎఫ్టీఎల్‌లో నివాసాలు ఉన్నట్టుగా గుర్తించారు. దీంతో ఆందోళన చెందిన అక్కడి ప్రజలు శుక్రవారం వేములవాడ సహకార సంఘం వద్ద ఆది శ్రీనివాస్‌ను కలిశారు. తాము ఎన్నో ఏండ్ల కింద అనుమతులు తీసుకొని ఇండ్లు కట్టుకున్నామని తెలిపారు. సర్వేతో భయమవుతుందని, ఎలాగైనా మీరే కాపాడాలని చేతులెత్తి మొక్కుతూ వేడుకున్నారు. నివాసాలకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా చూసే బాధ్యత తనదేనని ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ వారికి హామీ ఇచ్చారు. అక్కడే ఆర్డీవో రాజేశ్వర్ కూడా ఉండటం గమనార్హం.

కాంగ్రెస్ ప్రభుత్వ తీరును నిరసిస్తూ స్థానికుల నిరసన

ఖానాపూర్‌లో కూల్చివేతలకు కసరత్తు

చెరువు పరిసరాల్లోని ఇండ్లకు మార్కింగ్
అధికారులను అడ్డుకున్న స్థానికులు

ఆదిలాబాద్, సెప్టెంబర్ 27 (నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లాలో పేదల ఇండ్ల కూల్చివేతకు కాంగ్రెస్ ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తున్నది. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఖానాపూర్ చెరువు పరిసర ప్రాంతాల్లోని ఇండ్లను శుక్రవారం రెవెన్యూ, మున్సిపాలిటీ, ఇరిగేషన్ అధికారులు పరిశీలించారు. పలు ఇండ్లు ఎఫ్‌టీఎల్‌లో ఉన్నాయని కొలతలు తీస్తూ నంబర్లు వేశారు. స్థానికులు తమ ఇండ్లను మార్కింగ్ చేయవద్దని అధికారులు, సిబ్బందిని అడ్డుకున్నారు. ఎన్నో ఏండ్లుగా నివాసం ఉంటున్నాం.. మున్సిపల్ పర్మిషన్, ట్యాక్స్, కరెంటు బిల్లులు, ఆధార్‌కార్డులు ఉన్నాయని అధికారులు, సిబ్బందిని నిలదీశారు. గుడిసెలు, రేకుల ఇండ్లను కూల్చి వేయాలని చూస్తున్న సీఎం రేవంత్‌రెడ్డికి తమ ఉసురుతగులుతుందని మహిళలు శాపనార్థాలు పెట్టారు.

హైడ్రా డ్యామేజీకి కంట్రోల్ టీమ్!

- రేవంత్ సర్కార్ మరో కొత్త నాటకం
- రంగంలోకి కాంగ్రెస్ సోషల్ మీడియా టీం
- కూల్చివేతలతో ఇబ్బందులేవనేలా వీడియోలు

హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 27 (నమస్తే తెలంగాణ): 'మూసీ పరివాహక ప్రాంతాల కన్నీటి వ్యథ ఎవరికీ చేరొద్దు.. గూడు చెదిరిందని ఏడవొద్దు.. రోడ్డున పడ్డామని బాధపడొద్దు.. బాధితుల కష్టాన్ని నొక్కిపెట్టాలి. అందుకోసం మూసీవాసులకు ఇబ్బందులే లేవనేలా.. ప్రజలంతా కూల్చివేతలను హర్షిస్తున్నారనేలా సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం చేయాలి. ప్రభుత్వంపై వస్తున్న వ్యతిరేకతను నియంత్రించాలి.' ఇప్పుడు ఇదే లక్ష్యంతో రేవంత్ సర్కార్ మరో డ్రామాకు తెరతీసింది. మూసీ నిర్వాసితుల ఆర్తనాదాలను తుడిచిపెట్టడానికి సోషల్ మీడియా వేదికల ద్వారా రంగంలోకి దిగింది. అందుకోసం రూ.కోట్లు ఖర్చు చేయడానికి సమాయత్తమైంది. ఇప్పటికే మైండ్‌స్పేస్ వద్ద కార్యాలయం ఏర్పాటు చేశారు. ఫేక్ వీడియోలు చేసి ప్రచారం చేయడానికి 300 మందిని రిక్రూట్ చేసుకున్నారు. వీరికి ఒక్కొక్కరికి 45 వేల నుంచి 80 వేల వరకు జీతం ఇస్తున్నారని సమాచారం.

డ్యామేజీ కంట్రోల్..!

మూసీ కూల్చివేతల ప్రక్రియ రోజురోజుకు ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకుంటుంది. అభాగ్యుల ఇండ్లను కూల్చడంపై సమస్త సమాజం వ్యతిరేకిస్తున్నది. శత్రుదేశంపై దాడి చేసినట్టుగా కూల్చివేయడంపై జాతీయస్థాయిలో రేవంత్ సర్కార్ విమర్శలు ఎదుర్కొంటున్నది. రాజకీయ పార్టీలు కూడా మూసీ ఇండ్ల మార్కింగ్‌ను తప్పుపడుతున్నాయి. సామాజికవేత్తలు, నిపుణులు వ్యతిరేకిస్తున్నారు. వందల ఎకరాల్లో కబ్జా పెట్టిన భవంతులను వదిలేసి పేదోళ్ల ఇండ్లపైకి బుల్డోజర్లు పంపడం ఏమిటని మేధావులు ప్రశ్నిస్తున్నారు. హైదరాబాద్‌లో రేవంత్ సర్కార్ కూల్చుతున్న ఇండ్లకు సబంధించిన ఆర్తనాదాల వీడియోలు ప్రపంచదేశాల్లో ఉన్న తెలుగు వాళ్లందరికీ చేరుతున్నాయి. ఎన్‌ఆర్‌ఐల నుంచి తీవ్రంగా విమర్శలు వస్తున్నాయి. రేవంత్ సీఎంగా పనికిరాడు.. పాలించడం తెలియడం లేదని భావిస్తున్నారు. ఈ పరిస్థితులు సీఎం రేవంత్‌రెడ్డిని కంటి మీద కునుకు లేకుండా చేశాయి. సొంత పార్టీలోనూ వ్యతిరేకత వస్తుంది. మూసీ ఇండ్ల జోలికి వెళ్లి ఉండకపోయుంటే బాగుండేదని సన్నిహితులు సైతం చర్చించినట్టు సమాచారం. ఇలాంటి స్థితిలో రేవంత్ రెడ్డి ఆ వ్యతిరేకతను తగ్గించడానికి సోషల్ మీడియా టీంలను రంగంలోకి దించినట్టు తెలుస్తోంది. హైడ్రా కూల్చివేతలు సబబే అనేల వీడియోలు చేయించేలా ప్రణాళికలు చేస్తున్నారు. బాధితుల్లో ఉబికి వస్తున్న కన్నీటికి ఎన్ని సోషల్ మీడియా అకౌంట్లు అడ్డుకోలేవని రేవంత్ టీమ్ తెలుసుకోవాల్సి ఉందని నిపుణులు సూచిస్తున్నారు.

అర్ధరాత్రి బస్తీల్లో గస్తీ

- వెంటాడుతున్న కూల్చివేతల భయం
- రాత్రుళ్లు స్థానికుల కాపలా
- శత్రుదేశంపై దాడుల్లా సీఎం కక్ష
- కూల్చివేతలను అడ్డుకుంటాం
- బాధితుల హెచ్చరిక

ఎప్పుడు, ఎట్లా కూల్చివేతలు ప్రారంభమవుతాయోనన్న భయంతో అర్ధరాత్రివేళ గస్తీ నిర్వహిస్తున్న 'ఆపరేషన్ మూసీ' బాధితులు

హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 27 (నమస్తే తెలంగాణ): క్షణ క్షణం..భయం భయం.. మూసీ నిర్వాసితులు బస్తీల్లో అర్ధరాత్రి గస్తీకాస్తున్నారు. ఎటు నుంచి బుల్డోజర్లు వచ్చి తమ గూడుపైకి దూసుకొస్తాయో తెలియక హైరానా పడుతున్నారు. పిల్లలు, పెద్దలు, వృద్ధులు.. రెండు రోజుల నుంచి కంటి మీద కునుకులేకుండా రాత్రుల్లో తమ ఇండ్లకు రక్షణగా నిలుస్తున్నారు. కార్వాన్, బహదూర్‌పుర పరిసర ప్రాంత ప్రజలు బృందాలుగా ఏర్పడి హైడ్రాను అడ్డుకోవడంపై చర్చోపచర్చలు చేస్తున్నారు. హైడ్రా బుల్డోజర్లు తెల్లవారుజాము కూల్చివేతలు ప్రారంభిస్తుందని సోషల్ మీడియాలో వార్తలు వస్తుండటంతో వాళ్లంతా నిద్దురపోకుండా అడ్డుకోవడానికి సిద్ధమయ్యారు. ఇటువంటి దుస్థితి వస్తుందని తామెప్పుడూ ఊహించలేదని బాధితులు విస్మయం చెందుతున్నారు. శత్రుదేశాలపై యుద్ధం చేస్తున్నట్టుగానే రేవంత్ ప్రభుత్వం మా బతుకులపై దాడులు చేస్తుందని రహీం అనే స్థానికుడు ఆగ్రహం వ్యక్తం చేశాడు. చార్మినార్, అంబర్‌పేట్, కొత్తపేట, లంగర్‌హౌజ్ తదితర అన్నీ ప్రాంతాల్లో రాత్రి గస్తీ కాస్తూ తమ గూడు కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. కూల్చివేతలను అడ్డుకుంటామని హెచ్చరిస్తున్నారు.

మాపై ఎందుకంత కక్ష

మేం శత్రుదేశాలకు చెందినోళ్లం కాదు. మాపై అంత కక్ష ఎందుకు. మేం ఏం తప్పు చేశాం. మా ఇంట్లో పిల్లలు ఇల్లు ఎందుకు కూల్చేస్తారని అడుగుతున్నారు. బుల్డోజర్లు ఇండ్లను కూల్చేస్తాయని నెల రోజుల నుంచి నిద్దుర పోవడం లేదు. మా ఉసురు రేవంత్ సర్కార్‌కు తగులుద్ది.
– మల్లేశ్, అంబర్‌పేట

ప్రాణాలను లెక్క చేయం

హైడ్రా పేరు తలచుకుంటేనే భయం వేస్తోంది. ప్రజాపాలన అని చెప్పే సీఎం రేవంత్‌రెడ్డి పేదల మీదకు హైడ్రాను ఉసిగొల్పడం దారుణం. పేదల ఉసురు ఖచ్చితంగా కాంగ్రెస్ ప్రభుత్వానికి తగుతుంది. మా ఇళ్లను కాపాడుకోవడానికి ప్రాణాలను లెక్క చేయం.
– అపర్ణ, తులసీరాంనగర్, అంబర్‌పేట

హైడ్రాను అడ్డుకుంటాం..

పిల్లాజెల్లా అంతా భయపడుతున్నారు. ఎవ్వరూ నిద్దరపోవడం లేదు. ఇన్నేండ్లు ఇక్కడే బతుకుతున్నాం. ఉన్నపళంగా వెళ్లిపొమ్మంటే ఎలా ? ఈ రాత్రుల్లో మాకు ఈ శిక్ష ఏందీ? హైడ్రా బుల్డోజర్లు వచ్చినా.. పోలీసులొచ్చినా భయపడం. ప్రాణం పోయినా సరే వాటిని అడ్డుకుంటాం. మా ఇండ్లను కూల్చనివ్వం. **– ప్రసాద్, గోల్నాక, అంబర్‌పేట**

హైడ్రా.. అంత దూకుడెందుకు?

మొదటిపేజీ తరువాయి...

నోటీసు ఇచ్చి రేపు కూల్చేస్తారా? ఒక్క రోజు కూడా ఆగలేకపోతున్నారా? శనివారం నోటీసు ఇచ్చి ఆదివారం కూల్చేస్తారా? ఆ తర్వాత కోర్టు పనిదినం వచ్చే వరకైనా ఆగలేరా? ఆగమేఘాల మీద కూల్చేయాల్సిన అవసరం ఏమొచ్చింది? బాధితులకు గడువు ఎందుకు ఇవ్వడం లేదు? ఇంత దూకుడుగా వ్యవహరించడానికి కారణం ఏమిటి?' అని నిప్పులు చెరుగుతూ పలు ప్రశ్నలతో ఉక్కిరిబిక్కిరి చేసింది. హైడ్రా కేవలం నోడల్ ఏజెన్సీ మాత్రమేనని పేర్కొంటూ.. దానికి ఉన్న చట్టబద్ధత ఏమిటో చెప్పాలని నిలదీసింది. దీనిపై గతంలోనే వివరణ కోరామని, ఇప్పుడు మళ్లీ కోరుతున్నామని స్పష్టం చేసింది. తమ ప్రశ్నలపై వివరణ ఇచ్చేందుకు హైడ్రా కమిషనర్ తోపాటు సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండల తాసిల్దార్ వ్యక్తిగతంగా లేదా ఆన్‌లైన్‌లో విచారణకు హాజరు కావాలని పేర్కొంటూ.. తదుపరి విచారణను ఈ నెల 30కి వాయిదా వేస్తున్నట్టు ప్రకటించింది. అమీన్‌పూర్ సర్వే నంబర్ 164లోని ప్రభుత్వ భూమిలో ఆక్రమణలను 48 గంటల్లో తొలగించాలంటూ ఈ నెల 20న తాసిల్దార్ జారీ చేసిన నోటీసులను సవాలు చేస్తూ డాక్టర్ మహమ్మద్ రఫీ, గణేశ్ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్లపై జస్టిస్ లక్ష్మణ్ శుక్రవారం విచారణ చేపట్టారు. అమీన్‌పూర్ మండలం కిష్టారెడ్డిలోని శ్రీకృష్ణనగర్‌లో రఫీ, గణేశ్ కన్‌స్ట్రక్షన్ సంస్థకు సంబంధించిన ఆస్పత్రి భవనానికి సంబంధించి సెప్టెంబర్ 5న జారీచేసిన ఉత్తర్వులను తాసిల్దార్, హైడ్రా కమిషనర్ ఉల్లంఘించారని, కోర్టు ఉత్తర్వులకు విరుద్ధంగా కూల్చివేత చర్యలు చేపట్టారని తీవ్రంగా తప్పుపట్టారు.

నోటీసులిచ్చిన మరుసటి రోజే కూల్చివేతలు

పిటిషనర్ తరపు న్యాయవాది నరేందర్‌రెడ్డి వాదిస్తూ.. అమీన్‌పూర్ తాసిల్దార్ ఈ నెల 20తో ఉన్న నోటీసులను 21న సాయంత్రం 6.30 గంటలకు అందజేశారని, ఆ మరుసటి రోజు ఉదయం 7.30 గంటలకు జేసీబీలు, బుల్డోజర్లు, 50 మంది సిబ్బందితో హైడ్రా వచ్చి 5 అంతస్తుల దవాఖాన భవనాన్ని కూల్చేసిందని తెలిపారు. 165, 166 సర్వే నంబర్లలో రఫీకి చెందిన 270 గజాల స్థలాన్ని గణేశ్ కన్‌స్ట్రక్షన్స్ సంస్థకు విక్రయించడంతో ఆ స్థలంలో నిర్మాణాల కోసం గ్రామ పంచాయతీ నుంచి 2022 నవంబర్ 10న అనుమతులు తీసుకున్నారని వివరించారు. పంచాయతీ నుంచి అనుమతులు ఉన్నందున ఈ వ్యవహారంలో తాము జోక్యం చేసుకోవడం లేదని అప్పట్లో పంచాయతీ తరపు న్యాయవాది చెప్పడంతో ఆ పిటిషన్‌పై హైకోర్టు విచారణను మూసేసిందని గుర్తుచేశారు. ఇటీవల ఆ స్థలంలో కూల్చివేతలు చేపట్టనున్నట్టు హైడ్రా అధికారులు బెదిరించడంతో మరోసారి హైకోర్టును ఆశ్రయించాల్సి వచ్చిందని తెలిపారు. ఆ పిటిషన్‌పై ఇంతకు ముందు హైడ్రా తరపు న్యాయవాది స్పందిస్తూ.. పిటిషనర్ ఆస్పత్రి ఉన్న ప్రాంతాన్ని హైడ్రా ఎన్నడూ సందర్శించలేదని, కూల్చివేత చర్యలు చేపట్టాలంటూ అధికారులకు ఎలాంటి ఆదేశాలు జారీ చేయలేదని చెప్పడంతోపాటు ఏ చర్యలైనా జీవో 99కు అనుగుణంగానే ఉంటాయని హామీ ఇచ్చారని, దీంతో ఆ పిటిషన్‌పై సెప్టెంబరు 5న హైకోర్టు విచారణను ముగిస్తున్నట్టు ప్రకటించిందని వివరించారు. కాగా, గతంలో పంచాయతీ ఇచ్చిన అనుమతులను ఈ ఏడాది ఫిబ్రవరిలో రద్దు చేయడంతో అందుకు సంబంధించిన ఉత్తర్వులను హైకోర్టు సస్పెండ్ చేసిందని తెలిపారు. అయినప్పటికీ ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు జరిపినట్టు పేర్కొంటూ అమీన్‌పూర్ తాసిల్దార్ ఈ ఏడాది ఏప్రిల్ 2న నోటీసులు జారీ చేశారని, ఈ నోటీసులకు 15 రోజులు గడువు కావాలని పిటిషనర్లు కోరినప్పటికీ అనుమతించలేదని పేర్కొన్నారు. పిటిషనర్లు 18న వివరణ సమర్పించినప్పటికీ పరిగణనలోకి తీసుకోలేదని, ఈ నెల 20న నిర్మాణాలను తొలగించాలనే నోటీసుల్లో 48 గంటలే గడువు ఇచ్చారని చెప్పారు. ఈ నెల 20వ తేదీతో ఉన్న నోటీసులను 21న సాయంత్రం అందజేశారని, ఆ మరుసటి రోజు ఉదయమే నిర్మాణాలను కూల్చివేశారని తెలిపారు. దీనిపై హైడ్రా తరపు న్యాయవాది కటిక రవీందర్‌రెడ్డి వాదిస్తూ.. ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలను తొలగింపునకు యంత్రాలను, సిబ్బందిని పంపాలని కోరుతూ అమీన్‌పూర్ తాసిల్దార్ నుంచి ఈ నెల 21న లేఖ అందిందని, దీంతో జీవో 99 ప్రకారం ప్రభుత్వ స్థలం రక్షణ కోసం యంత్రాలను, సిబ్బందిని పంపామని వివరించారు.

హైకోర్టు ఉత్తర్వుల ఉల్లంఘనే..

అనంతరం ఇరు పక్షాల వాదనలను, రికార్డులను బేరీజు వేసిన హైకోర్టు.. ఆక్రమణలను తొలగింపునకు తాసిల్దార్ జారీ చేసిన నోటీసుపై పిటిషనర్ స్పందించలేదని గుర్తించింది. అలాగే ఏప్రిల్ 15న పిటిషనర్ గడువు కోరిన విషయాన్ని మాత్రమే తాసిల్దార్ గమనంలోకి తీసుకున్నారని, అందుకే ఏప్రిల్ 18న పిటిషనర్ సమర్పించిన వివరణను పరిగణనలోకి తీసుకోకుండా కూల్చివేతలకు ఉత్తర్వులు జారీ చేశారని పేర్కొన్నది. పిటిషనర్ల వ్యాజ్యంపై విచారణ పూర్తయ్యే వరకూ ఆ నిర్మాణాల్లో జోక్యం చేసుకోరాదని గతంలో హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసిందని, అయినప్పటికీ కూల్చివేత చర్యలు చేపట్టడం హైకోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించడమే అవుతుందని స్పష్టం చేసింది.

ఎస్సీ వర్గీకరణపై అభిప్రాయ సేకరణకు
క్యాబినెట్ సబ్ కమిటీ నిర్ణయం

హైదరాబాద్, సెప్టెంబర్ 27 (నమస్తే తెలంగాణ) : ఎస్సీ వర్గీకరణ అంశంపై అన్ని షెడ్యూల్డ్ కులాల ప్రతినిధులు, కులసంఘాల నుంచి అభిప్రాయాలను సేకరించాలని క్యాబినెట్ సబ్‌కమిటీ నిర్ణయించింది. ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణకు ఇటీవలే సుప్రీంకోర్టు సానుకూల తీర్పు వెలువరించిన నేపథ్యంలో ఆ తీర్పులోని న్యాయపర అంశాలను అధ్యయనం చేసి, దాని అమలుకు సిఫారసులు చేసేందుకు ప్రభుత్వం క్యాబినెట్ సబ్ కమిటీని నియమించింది. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నేతృత్వంలోని కమిటీ శుక్రవారం భేటీ అయి అభిప్రాయాలను సేకరించాలని నిర్ణయించింది. ఈ నెల 30 నుంచి అన్ని సంఘాలు తమ అభిప్రాయాలనుcommr. scsubclassification@gmail.com కు పంపించాలని సూచించింది.

టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో వైసీపీకి చుక్కెదురు

మధ్యంతర ఉత్తర్వుల జారీకి సుప్రీంకోర్టులో నిరాకరణ

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 27 (నమస్తే తెలంగాణ): ఏపీలో టీడీపీ ప్రధాన కార్యాలయంపై జరిగిన దాడి కేసులో వైసీపీ నేతలకు చుక్కెదురైంది. ఈ కేసులో ముందస్తు బెయిల్ నిరాకరిస్తూ ఈ నెల 22న ఏపీ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులకు వ్యతిరేకంగా వైసీపీ నేతలు మన్యం జగదీశ్, వెంకటసుబ్బారావు, వినోద్‌కుమార్, హరిబాబు, ఆంజనేయులు, అమితాబ్, గెల్లిపోగు రాజు దాఖలు చేసుకున్న పిటిషన్లపై మధ్యంతర ఉత్తర్వుల జారీకి శుక్రవారం సుప్రీంకోర్టు నిరాకరించింది. 48 గంటల్లోగా పిటిషనర్లు తమ పాస్‌పోర్టులను దర్యాప్తు అధికారులకు సరెండర్ చేయాలని ఆదేశించింది. కేసు విచారణకు పూర్తిగా సహకరించాలని, దర్యాప్తు అధికారులు పిలిచినప్పుడు హాజరుకావాలని వారికి స్పష్టం చేస్తూ.. తదుపరి విచారణను అక్టోబర్ 1కి వాయిదా వేసింది.

డబుల్ ఇండ్లు వాళ్లకు ఎట్లిస్తరు?

- స్థానికేతరులకు కేటాయింపుపై జియాగూడ ఆగ్రహం
- అధికారుల వివరణతో శాంతించిన స్థానికులు

కార్వాన్, సెప్టెంబర్ 27: జియాగూడలోని డబుల్ బెడ్‌రూం ఇండ్లను స్థానికేతరులకు కేటాయించవద్దంటూ ఆ ప్రాంతవాసులు ఆందోళనకు దిగారు. దీంతో జియాగూడలోని డబుల్ బెడ్‌రూం ఇండ్ల వద్ద శుక్రవారం రాత్రి ఉద్రిక్త వాతావరణం నెలకొన్నది. అయితే పోలీసులు, రెవెన్యూ అధికారులు వారికి నచ్చజెప్పడంతో వివాదం సద్దుమణిగింది. ప్రభుత్వం చేపట్టిన కూల్చివేతల్లో భాగంగా జుమ్మేరాత్ బజార్ ఉప్పలమ్మ ఆలయం సమీపంలో నివసిస్తున్న 16 కుటుంబాలను నోటీసులిచ్చి ఖాళీ చేయించారు. వారికి జియాగూడలోని డబుల్ బెడ్‌రూం ఇండ్లు కేటాయించారు. దీంతో వారంతా శుక్రవారం రాత్రి తమ సామాన్లతో జియాగూడకు చేరుకున్నారు. విషయం తెలుసుకున్న స్థానికులు అక్కడికి చేరుకొని వారిని అడ్డుకునేందుకు ప్రయత్నించారు. దీంతో ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. సమాచారం తెలుసుకున్న డిప్యూటీ కలెక్టర్, ఆసిఫ్‌నగర్ తహసీల్దార్ జ్యోతి, స్థానిక కార్పొరేటర్ దర్శన్ అక్కడికి చేరుకున్నారు. డబుల్ బెడ్‌రూం ఇండ్లను తమ ప్రాంతం వారికే కేటాయించాలంటూ గత నాలుగేండ్లుగా ప్రభుత్వంతో పోరాడుతున్నామని, ఇప్పుడు అకస్మాత్తుగా బయటివారికి ఎలా కేటాయిస్తారని అధికారులతో వాగ్వాదానికి దిగారు. తమ ప్రాంతంలో కూడా సర్వే చేస్తున్నారని ఇక్కడ ఇండ్లు కోల్పోయేవారికి ఇక్కడే కేటాయించాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఖాళీగా ఉన్న ఇండ్లను జియాగూడలోని పేద ప్రజలకే ఇవ్వాలని డిమాండ్ చేశారు. అధికారులు మాట్లాడుతూ.. కేవలం 16 మందికే పట్టాలు ఇచ్చామని, ఇకముందు స్థానికులకే ప్రాధాన్యం ఇస్తామని తెలపడంతో సమస్య సద్దుమణిగింది. ఈ పట్టాలు అందుకున్న 16 మందిలో 11 కుటుంబాలు మాత్రమే డబుల్ బెడ్‌రూం ఇండ్లలోకి ప్రవేశించాయి. మిగతా ఐదు కుటుంబాలవారు సరైన పత్రాలు తేలకపోవడంతో వారికి కొంత సమయమిచ్చారు.